# తెలుగు సాహిత్యంలో స్త్రీల పాటలు

ఇల్లిందల సరస్వతీ దేవి

"వేదంబుల్ నృపశాసనంబులు సుహృద్విజ్ఞాపంబుల్ పురా,
ణాది గ్రంథము లంగనాజన విలాసాలాపలీలా సమ,
ప్రాదుర్భావము లౌర కావ్యములు కర్తవ్యోపదేశ క్రియా,
వాద ప్రక్రియ లెన్న కావ్యమహిమల్ వర్ణింపగా శక్యమే"

అన్నాడు రామరాజ భూషణుడు. వేదములు ప్రభుసమ్మిత ములనీ, పురాణములు మిత్రసమ్మితములనీ, కావ్యములు కాంతా సమ్మితములనీ పెద్దలు విభజించినారు. కావ్యములు రెండు విధము లనీ నిర్వచించినారు. పద్య కావ్యములనీ, గద్య కావ్యములనీ. సంగీత సహవాసము లేని సాహిత్యము సరస్వతీదేవి సంపూర్ణ స్వరూపము కాజాలదని పెద్దల ప్రవచనము. అట్టి సంగీత సాహిత్య సమ్మేళనమే పద కవిత్వము. ఈ పదకవిత్వము బిడ్డల తొలి పలుకులవలె మధురాతి మధురములు. ఈ శ్రేణికి చెందినవి స్త్రీల పాటలు.

ఈ పాటలు సులభశైలిలో పండిత పామర జనానందకర ముగా రచింపబడినవి. స్త్రీ విధ్యుక్త ధర్మములను,లౌకిక జ్ఞానమును, పురాణ పరిచయమును, చారిత్రక విశేషములను, వేదాంత తత్వము లను, వైద్య విషయములను మన ప్రాచీనులు అధిక విద్యావంతులు కాని స్త్రీలకు ఈ పాటల మూలమున బోధచేసినట్లు కనబడుతుంది. ఈ పాటలనిండా భారతీయ సంస్కృతి, నాగరికత, ప్రాచీన సంప్ర దాయములు వెల్లువలై ప్రవహిస్తూ ఉంటాయి. పుస్తకములు చేత బట్టి చదువుకొను తీరికలేనివారికీ, అక్షరజ్ఞానము లేనివారికీ ఈ పాటల రూపమున చక్కని విద్యాబోధ జరిగినట్లు కనబడుతుంది. ఆ కాలములో వయోజన విద్యావ్యాప్తి ఈవిధముగా సాగుతూ స్త్రీలలో చక్కని విజ్ఞానవ్యాప్తి కలిగేది. పాటలన్నీ కథారూపము నుండి కథావైచిత్రి పదవైచిత్రులతో నిండివున్నాయి.

స్త్రీల కంఠస్వర నాళములకు (Vocal Chords) అధిక శ్రమ కలిగినట్లయితే గర్భాశయమునకు హాని కలుగుతుందని ప్రాచీనుల నమ్మకము. ఈ కారణములవల్లనే ప్రణవమును స్త్రీలకు నిషేధించి నారు. అందువల్ల స్త్రీల శారీరక నిర్మాణము ననుసరించి హానికర ములు కానటువంటి రాగములతో సునాయాసముగా పాడుటకు అనుకూలముగా రచించినారు. ఈ పాటలన్నీ శుభరాగముతో కలిసిన పదపల్లవి గల పాటలు. సాధారణముగా మధ్యమస్థాయిలో ఉంటాయి. నిత్య జీవితములో సందర్భోచితములుగా రచింప బడినవి.

ప్రసూతి సమయములలో శ్రీకృష్ణ జననము అను పాట పాడుతూ ఉంటారు. దీనిలో చెరసారలో ఉన్న దేవకీదేవికి శ్రీకృష్ణుడు జన్మించటము. దేవకీ వసుదేవులకు కంసునివలన భయము, కంసుని దుష్టత్వము, శ్రీకృష్ణుని బాల్యక్రీడలు, కంసవధ మొదలైన విషయములు వర్ణింపబడి ఉన్నాయి. ఈ మాదిరిలో శ్రీరామ జననము అను పాట ఉన్నది.

జోలపాటలు, లాలిపాటలు పసిబిడ్డలకు పాడే పాటలు. వీనిలో లాలిపాటలు ఏడ్చే బిడ్డలను సమాధానపెట్టుతూ లాలిస్తూ పాడేవి. జోలపాటలు బిడ్డలను నిదురపుచ్చటానికి పాడేవి. "శిశు ర్వేత్తి పశుర్వేత్తి—వేత్తిగానరసం ఫణీః" అన్నట్లుగా పసిబిడ్డలు గానమాధుర్యమునకు ముగ్ధులై ఆకర్షింపబడుతారు. నిద్ర కనుకూల మైన శ్రీరాగములోను, కాలసూచక రాగమైన ఆనందభైరవిలోను ఈ పాటలను పాడుతూ ఉంటారు. అదిగాక పండ్లురాని పసిబిడ్డలకు ప్రబోధకరములైన విషయములను, జోలపాటల రూపమున నిత్యమూ పాడి బిడ్డలకు బోధచేయవలెనన్న ముఖ్యోద్దేశము ఇమిడి ఉన్నది. విభిన్న కాలములలో కాలానుగుణములైన మార్పులను చేయుటకై అవతారము నెత్తిన పరమాత్మకు, ప్రకృతి మాయలో పడి, విధ్యుక్త ధర్మమును మరచిపోకుండ ఉండటానికి బాల్యములో, దేవతలచే ప్రేరితులైన తలిదండ్రులు వెనుకటి అవతారఘట్టములను పాడి, జ్ఞాపకము చేసినట్లు కొన్ని పాటలవలన మనకు తెలుస్తున్నది.

నిదురించే మనసు శాంతిని కోరుతుందనీ, గాఢ సుషుప్తిలో ఏకత్వ సుఖమూ, శాంతి ఉంటాయి కనుక ఆ సమయములో బిడ్డల ఆత్మను ప్రబోధించుతూ, దేహధారియైన జీవుడు పరమాత్మ లోని ఒక అంశమనీ, కర్తవ్యము నిర్దేశించుతూ గానము చేయటము ఆచారమైనది. అదిగాక బిడ్డలు నిదురించేటప్పుడు గాలి, ధూళి సోకకుండనూ, వారి అంతఃకరణను ప్రజ్వలింప చేయటానికి అఖండమైన ఆత్మ సంస్కృతిని బిడ్డలకు కలిగించటానికీ ఈ పాటలు తోడ్పడుతాయి. అందుకొరకే పురాణగాథలు, వీరగాథలు, ఈ పాటలలో ఇమిడి ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనది వేదాంత తత్వములతో నిండి ఉన్న దీపాట:

కి న్నె ర

జో అచ్యుతానంద జోజో ముకుందా
రార పరమానంద రామ గోవిందా                జోజో

తొలుత బ్రహ్మాండంబు తొట్టి గావించీ
నాలుగు వేదాల గొలుసు లమరించీ
బలుసైన ఫణిరాజు పాన్పుగావించీ
చెలుల డోలికలోన చేర్చి లాలించీ                జోజో

తొమ్మిదీ వాకిళ్ల తొట్టె లోపలనూ
క్రూరులను ఆరుగురు సాధు లైదుగురూ
అందులో ముగ్గురు మూర్తులున్నారూ                జోజో

పట్టవలె ఆర్గురిని పదిలంబుగాను
కట్టవలె ముగ్గురుని కదలకుండగను
ఉంచవలె ఒక్కరిని హృత్కమలమందూ                జో అచ్యు

ఓంకార మనియేటి ఒక తొట్టెలోనూ
తత్వమసి అనియేటి చలువలం బరచి
వేడ్కతో పాపడిని ఏర్పాటుచేసీ
ఏడు భువనముల వా రేకమై పాడ                ....జోజో....

నవరంధ్రాలతో కూడిన మానవ దేహంలోపల క్రూరులైన ఆరుగురు అనగా కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యములనే అరిషడ్వర్గములను అరికట్టి, సాధులనబడు పంచేంద్రియములను నిగ్రహించి, ముగ్గురు మూర్తులైన సత్వరజస్తమో గుణములను కట్టడిచేసి హృదయకమలములో పరమాత్మను నిలుపుకొనమని ఈ జోలపాటలోని భావము. అఖండమైన ఆత్మసంస్కృతి కలగజేయటానికి, మధురస్వరముతో, మంగళకరమైన రాగములో మృదు మధుర గాథలను వినిపించటమూ—"జోజో" అనటములో "నీ వెవరని అనుకుంటున్నావో, నీది పరమాత్మ స్వరూపము సుమా!" అని హెచ్చరించటమూ మానవ నైజములోని బలహీనతను అరికట్టే మార్గములను బోధిస్తూ, ఆధ్యాత్మిక శిక్షణను ఆ పసిపాపలకు ఇవ్వటంలో ఆధ్యాత్మికముతో కూడిన ఈశ్వరీయ జ్ఞానమును బాల్యములోనే ప్రారంభించ వలెననునది, మన ప్రాచీనుల ఆదర్శమని సువ్యక్త మవుతున్నది. వీర గాథలను, మానవ ధర్మములను, అవతార ఘట్టములను జోల పాటలలో ఇమిడ్చి, బిడ్డలను నిదుర పుచ్చటానికై పాటటంలో భ్రమరకీటన్యాయముగా వారిని వీరులనుగా సిద్ధము చేయవలెనని ప్రాచీనుల ఆశయమని మనకు తెలుస్తున్నది. పెండ్లి పాటలలో నలుగుపాటలు, గంధపు పూత పాటలు, బూవం బంతిపాటలు, వరుసపాటలు, అప్పగింతల పాటలు, తలుపు దగ్గర పాటలు, మంగళహారతులు చిత్ర విచిత్రములుగా వుంటాయి.

బూవం బంతిపాటలు భోజనములవద్ద పాడేవి. వీటిలో భోజన పదార్థములు, వియ్యాలవారింట కొలుతలు, విందు వైభవము వర్ణించబడి వినోదకరముగా వుంటాయి.

తలుపు దగ్గర పాటలు ద్వారమున కవతల స్వామి-ఇవతల దేవి- మధ్య తలుపులు బంధింపబడి ఉంటాయి. స్వామి తలుపులు తెరవమని అంటాడు. ఆమె తెరవనంటుంది. ఆయన మాటలను ఆమె నమ్మనంటుంది. అవతార ఘట్టములను ఏకరువుపెట్టి నేను ఆదినారాయణుడను తలుపు తీయమని స్వామి అడగటము-దేవి-నేను ఆదిలక్ష్మినని అలిగి మూతి బిగించటమూ-కడకు స్వామి అనునయపు వాక్యాలతో దేవి తలుపులను తీయించటము జరుగుతుంది.

వరుసపాటలు వదినగారిమీదనూ, బావగారిమీదనూ, వియ్యాల వారిమీదను వరుసతోకూడిన హాస్యరసముతో నిండి ఉంటాయి.

సామాన్యముగా ఈ పాటలలో సత్యభామాదేవినీ, ఆది లక్ష్మినీ పేర్కొంటారు. తలుపులు తీయనునటములో హృదయ కవాటము తెరువుమన్న అర్థము స్ఫురించుతూ ఉంటుంది.

అప్పగింతల పాటలు—ఇవి కరుణారస భూయిష్ఠమైనవి. కన్యక తలిదండ్రులు తమ బిడ్డను అత్తమామలకు భర్తకు వివాహమైన తరువాత అప్పగించునపుడు పాడేవి.

కోడలూ మీ సొమ్ము కొడుకు మీ సొమ్ము
ఆడవారికన్న అలసంతెనమ్మ
సిరివంటి కోడలు మరువంటి కొడుకు
మగువరో నీ భాగ్య మహిమ యేమమ్మా
మా బాలకాదు-మీ బాలయో సుమ్మీ
మెల్లగా నేర్పుతో పని నేర్పవమ్మా
ఇటువంటిదే మరొకటి వాడుకలో ఉన్నది.
అత్తగారమ్మ-అరడి సేయకమ్మ
వత్తులు వత్తకమ్మ ఒత్తిగిలి ఉండవమ్మ

అని దైన్యముతో ప్రార్థించునట్లుగా ఉంటాయి. మరికొన్ని బిడ్డను అత్తవారింటికి పంపునపుడు చెప్పు సూక్తులు.

అత్తమామల మాట అడి దాటరాదు
పొరుగిండ్ల కెన్నడు పోరాదు సుమ్మీ
మరదలు బావలు పరిహాసింపగను
చిన్నబోరాదమ్మ చిన్నారి చిలుక
పరులతో పలుమారు భాషింపరాదు
అంధుడైన అతిరోగిడేయైన
పేదవాడైనను జూదరియైన
ఈశ్వరుం డతడుగా ఇంత సేవించు
పెనిమిటే యొక దైవమని చూడవమ్మా
మాకు నపకీర్తిని మరి తేకుమమ్మ
పుట్టిలు గాదమ్మ పొలతుల కవని
అత్తల్లు నిత్యంబు అబలల కెపుడు—

పుట్టింటినుండి అత్తవారింటికి వెళ్లటము స్త్రీ జీవితములో ముఖ్యఘట్టము. కన్యక అత్తవారింటికి వెళ్లునప్పుడు ఆ కాలములో వయసు చాలా అల్పము. ఆ చిన్న బాలిక మట్టు మర్యాదలతో అత్తవారింట—తనతోటివారిని తనకంటె పెద్దవారిని మన్నించుతూ అత్త మామలను తలిదండ్రు లనుకొని భక్తిగౌరవముతో సేవించుతూ సేవకులకు తలలోని నాలుకవలె మెలగుతూ ఉండవలసి యుంటుంది. వీరందరూ ఒక ఎత్తూ—పెనిమిటి ఒక్కడూ ఒక ఎత్తూ. అత డెటువంటివాడైనా దేవునివలె భావించి—అతడినే నమ్ముకొని జీవించటమూ—ఆతడి అదుపు ఆజ్ఞలలో ఉండి కనుసన్నలలో మెలగటమూ—స్త్రీ ధర్మము. కనుక ఆ సూక్తులను ఏమరకుండా బాల్యమునుండి ఉగ్గుపాలతో నూరిపోస్తూ ఉండేవారు. ఇప్పుడు వృక్షశాస్త్రజ్ఞులు భిన్నజాతి కొమ్మను తీసుకొనివచ్చి మరియొక చెట్టుకు కలపటమూ—అది చిగిర్చి పుష్పించటమూ ఈ కాలములో మనము చూస్తున్నాము. క్రొత్తగా అతకబడిన కొమ్మ మంచి పుష్టికలదయి అతికించబడిన క్రమము సక్రమమైనట్లయితేనే అది చిగిర్చి పుష్పించటము జరుగుతుంది. ఆ భావమే స్త్రీ జీవితములో వర్తిస్తుంది. ఆ బాలికకు ఎంత విద్యా—సంస్కారము—జ్ఞానమూ ఉంటే బాల్యములో పరాయివారిని ఆత్మీయులుగా భావించి మెలగగలదు. నిజముగా స్త్రీ జీవితము అసిధారా వ్రతమువంటిదని ఈ పాటలు మనకు వేయినోళ్ళతో చాటుతాయి. పెండ్లి సందర్భములో అలుకపాటలు—చెండ్లపాటలు మొదలైనవి సందర్భోచితముగా ఉంటాయి.

ఇవిగాక స్త్రీలు తీరిక సమయములలో పాడుకొంటూ ఉండేవి వీటికంటె పెద్దపాటలు. వాటిలో ధర్మరాజు జూదము ప్రసిద్ధమైన భారతకథ. రాజసూయయాగానంతరము దుర్యోధనునిచే ప్రేరితుడైన ధర్మరాజు మాయజూదములో రాజ్యమును, తమ్ములనూ భార్యనూ పణముగాపెట్టి ఓడిపోతాడు, అప్పుడు రారాజు ద్రౌపదిని సభలోనికి ఈడ్చి తెప్పించి ద్రౌపదీ వస్త్రాపహరణమును తలపెట్టినాడు. ద్రౌపదికి శ్రీకృష్ణుని వస్త్రదానము లభిస్తుంది. ఈ సందడిలో అంధుడైన వృద్ధరాజు ద్రౌపదికి కోరిన వరము లిచ్చి పంపుతాడు. ఈ కథలో ద్రౌపది కాలితో పాచికలను తోస్తూ పందెము వేసినదనీ తమ రాజ్యమును తిరిగి గెలుచుకొన్నదనీ వివరించబడి ఉన్నది. దీనిలో లక్ష్మీదేవికి జ్యేష్ఠాదేవికి జరిగిన వివాదము చాలా యింపుగా ఉంటుంది. ప్రాచీన సాంప్రదాయములకు ఆచారములకు వ్యతిరేకించి నడచినట్లయితే దారిద్ర్యము సంక్రమిస్తుందనీ వివరించి యున్నది. లక్ష్మీదేవి లోకోత్తర తేజోధర్మ నిరతుడైన ధర్మరాజును గురించి జ్యేష్ఠాదేవితో చెప్పుతుంది.


ప్యాకింగ్ కేసులు



మీకు కావలసిన సైజులలో
ప్యాకింగ్ కేసులను
మేము తయారుచేసి
ఇవ్వగలము.

జోస్ ఇండస్ట్రియల్స్,
ఒల్లూర్ (కొచ్చిన్ స్టేట్)

ఆతికి పీడినయట్టి యాగడపలను
తానెన్నడును గాని దాటడే రాజు
దివ్వెలేని గృహముదెస కూడనెందు
చూడ్కుల బరపుచు చూడదే రాజు
సిరాడ లేనింట నిలువడే రాజు
ఏ ధర్మనందను నెడబాయలేను
పక్షపాతము సభ పలుకడె రాజు
ఏ ధర్మనందను నెడబాయలేను
జంటగా పెండ్లిండ్లు సల్పడే రాజు
ఏ ధర్మనందను నెడబాయలేను

అని చర్చిస్తుంది.

లక్ష్మణదేవర నవ్వు-రావణ వధానంతరము శ్రీరామ చంద్రుడు అయోధ్యాపురము ప్రవేశించిన తరువాత జరిగిన విచిత్ర సంఘటన యిది. ఒకనాడు శ్రీరామ చంద్రుడు వెన్నెల బయలులో నిండు కొలువు దీర్చియుండగా ఆయన సమీపముననున్న లక్ష్మణుడు పక్కున నవ్వుతాడు. ఆతని నవ్వు ఆ సభలో పెద్ద కలవరమును రేపుతుంది. సభాసదులందరు ఆత్మ పరీక్షలు చేసుకొని తమలోగల దోషములకే లక్ష్మణస్వామి నవ్వియుండవచ్చునని సిగ్గుపడి తలలు వాల్చుకుంటారు.

తనలోన శశిమౌళి తలపోసె నట్లు
జాలరి వీథుల నీలి కన్యకను
జడలెత్తి శిరసున ముడిచికొంటినని
తలచి లక్ష్మణమూర్తి తా నవ్వెననుచు
కొలువులో శంకరుడు తల వంచుకొనెను.

ఈవిధముగా సభ కలవరపడి పోతుండగా శ్రీరామచంద్రునికి తమ్ముని అహేతుకమైన నవ్వు కోపకారణమైనది. తమ్ముని మీద పట్టరాని ఆగ్రహము కలిగినది. తల నరుకుటకు సిద్ధపడినాడు. అప్పుడు లక్ష్మణస్వామి- సీతారాములు అడవిలో యుండగా రాత్రి వేళ క్రూర మృగ బాధ లేకుండా వారి నిద్దరిని కాపాడడముకొరకు తాను నిద్రను విసర్జించి సేవించినాడనీ—ఇపు డయోధ్యాపురము రాగానే తనకు కునుకువచ్చినదనీ అదే నవ్విన కారణమని తెలిపినాడు. ఈ పాటలో శ్రీరామచంద్రునికి సోదరునిమీదగల వాత్సల్యము లక్ష్మణుని భ్రాతృభక్తి వర్ణనాతీతములు.

ఊర్మిళాదేవి నిద్ర—శ్రీరామ లక్ష్మణులు వైదేహితో అడవుల నేగినపుడు ఊర్మిళాదేవి గాఢసుషుప్తిలో వారు తిరిగివచ్చే వరకు ఉంటుంది. శ్రీరామ పట్టాభిషేకమైన తరువాత లక్ష్మణుని చిన్నబోయిన ముఖమును గమనించి వదినెగారు — మరదిని ఊర్మిళాంతఃపురములోనికి పంపుతుంది. నిద్రమత్తులో ఉన్న ఊర్మిళ—లక్ష్మణస్వామిని పురుషునిగా భావించి—పరస్త్రీని గోరి చెడిపోయినవారి పేరులన్నీ ఏకరువు పెట్టి-మా అక్క మరిది అసాధ్యుడు—నీవు రాగా చూసినట్లయితే నిలువునా చీల్చేస్తాడంటుంది. లక్ష్మణుడు నవ్వుకొని, తాము అడవులలో అనేక కష్టములు పడివచ్చినామనీ, తానే లక్ష్మణస్వామినని అంటాడు. ఆమె ఆ నిద్రమత్తులో ధీరులవలె మీ రిద్దరన్నదమ్ములుండగా మా అక్క రాక్షసుల పాలుపడటము ఎట్లా సంభవించిందీ? అని ప్రశ్నించుతుంది. లక్ష్మణస్వామి జరిగిన కథను చెపుతాడు. ఆమె కది పగటి కలగా తోస్తుంది. కాని సీతమ్మ అగ్నిప్రవేశము మాట వినగానే ది పడకమీద లేచి కూర్చుంటుంది. ఈకథ చాలా రమణీయముగా వర్ణింపబడినది.

సత్యభామ సరసము—ఇది సత్యాకృష్ణుల శృంగార కేళీ విలాసము. శ్రీకృష్ణుడు మాటలతోనూ, వాగ్దానములతోనూ తనకు సత్యమీద గల ప్రేమను ఋజువుపరచుకొని, ఆమెకు నివేదించుకుంటాడు. కాని ఆమె నమ్మదు. కడకు ఆమె పాదాలను మరొకసారి స్పృశించ తలపడుతాడు. ఆమెను సమ్మతించటానికి వేయి పన్నాగాలు పన్నుతాడు. అద్దమువలె నున్న ఆమె హృదయములో సవతుల ప్రతిబింబాలు ప్రతి నిముషమూ కనబడుతుంటాయి. ఆమె జీవితము నమ్మకము లేని స్వామికి సుఖము లేనన్నట్లుగా ఉంటుంది. ఆమె మనఃప్రవృత్తి తెలిసిన గోపాలుని చేష్టలన్నీ కొంటె చేష్టలు. వారిద్దరి వాదనలతో శృంగార రసము చిప్పిలుతూ ఉంటుంది ఈ పాట.

ధర్మాంగద చరిత్ర—ఈ కథ అభూత కల్పనలతో నిండి వున్నదని పండితుల అభిప్రాయము. సత్యాసత్యముల వివాదం ఎట్లున్నా ఈ పాట మాత్రము చాలా కాలమునుంచీ ప్రచారములో ఉన్నది. కార్తీకమాసములో నాగచతుర్థినాడు ఈ పాటను స్మరించని వారుండరు. స్త్రీ జీవితములో దీక్ష ఎంతటి ఘనకార్యములనైనా చేయించగలదను నమ్మకమును పుట్టించగల యిది మానవులకు పాములు పుట్టటమూ, తలిదండ్రుల దుఃఖమూ, మంత్రి ఆలోచన, అమాయకురాలైన బాలికను దానికి వివాహము చేయటము, ఆ బాలిక పాముతో పుణ్యక్షేత్రములన్ని తిరిగి—పతికి మానుష రూపము నిప్పించటమూ మొదలైన అద్భుత కరుణారసముల నొలికించే గాథ యిది.

కుశలవకుచ్చల చరిత్ర—రాముని పత్ని అయిన సీతమ్మ కరుణామయగాథ యిది. ఉత్తరరామాయణములోని సీతాపరిత్యాగ ఘట్టమూ—సీతమ్మ దుఃఖము శ్రీరాముని హృదయవేదన—కుశలవులకు—తాతగారు చెప్పిన రామాయణ కథానాయకుడైన రాముని మీద కోపము—అశ్వమేధయాగము—కుశలవుల రామాయణ సంకీర్తనమూ—వర్ణనాతీతము. లంకాయాగము శ్రీరాముడు రావణునితో చేసిన యుద్ధమును వివరించిన పాట యిది.

ఉప్పుకోసము వచ్చి సుగ్రీవుడా
నేను కప్పురమును గోల్పోతిని.

అని లక్ష్మణుడు మూర్ఛపడినపుడు శ్రీరాముని విలాపము మొదలైన సంఘటనలతో నిండిఉంటుంది. గంగా గౌరి సంవాదము సవతుల వాదనలతో వింతగా ఉంటుంది. గోవుపాట—తనను మ్రింగవచ్చిన పులికి గోవు తన బిడ్డలకు పాలిచ్చి తిరిగి వస్తానని వాగ్దానము చేసి ఇంటికి వెళ్లుతుంది. ఆ దూడలకు యిక ముందు తల్లి లేకపోతుందిగదా అని దుఃఖించుతుంది. ఇరుగుపొరుగు ఆవులకు ఆ దూడలను అప్పగించుతుంది. కళ్ళనీళ్ళతో, తడబడుచున్న పాదములతో పులిని సమీపించి తనను ఆహారముగా దినుకొమ్మంటుంది. గాని దాని సత్యసంధతకు వ్యాఘ్రములోని క్రౌర్యము, పశుత్వము నశించి, మానవత్వమును దాటి దేవత్వము కలుగుతుంది. ఈ పాట కరుణారస భూయిష్ఠమైనది.

కూనలమ్మ సంకీర్తన మనునది సుమతీ శతకమువంటి నీతి బోధాత్మకమైనది.

అన్నమిచ్చినవాని - అతిథ నిచ్చినవాని
అపహసించిన హాని ఓ కూనలమ్మా
దుర్యోధనుడు భోగి.
ధర్మరాజొక జోగి—
అర్జునుం డేయోగి ఓ కూనలమ్మా.
ఎంత చేసినవాని కంత ఫలమేగాని
చింత సేయగ నేల ఓ కూనలమ్మా—

ఇవిగాక ఇంకనూ అనేక పాటలు-సత్యా ద్రౌపదిసంవాదము-ఐరావతము-తులసీ మహాత్మ్యము-కుచేలోపాఖ్యానము-గుహా భరతుల అగ్నిప్రవేశము-చెంచీత పాట-మొదలైన స్త్రీల పాటలు అనేకముగా ప్రచారములో ఉన్నాయి.

ఇవన్నీ సులభమైన మనోహర శైలిలో, మధుర భావములతో, సముచితోపమానములతో, అనుశ్రుతమైన విజ్ఞానముతో, మంగళకరమైన రాగములో ఉన్నాయి. ఇవి చాలా కాలము వాఙ్మాహిత్యముగా నిలిచిపోయినందువలన తప్పుల కుప్పలైనవి. వాటిని ఆవిధముగానే తప్పుల తడకలుగా అచ్చువేసి అణా కొక పుస్తకము వంతున చెట్లక్రిందకూడ అమ్మకము సాగించుచున్నారు. ఆ పదకర్తల దివ్యనామములను మనము తెలిసికొనలేము. కాని పండితులైనవారు వాటిని సరిచేసి చక్కగా ముద్రించి ప్రచారమునకు తీసికొని రావలసిన బాధ్యత వహించినట్లయిన ఆ పాటలలోని విజ్ఞానము చక్కగా ప్రచారములోనికి రాగలవనటములో సందేహము లేదు.

[జనగామ హిందీ ప్రేమీమండలి వార్షికోత్సవంనాటి ప్రసంగం]


VIJAYA'S THREE GEMS

విజయా రత్నత్రయము

ASOKA
AMLA VEPA BRAHMI
VEGETABLE HAIR OILS

అశోకా అమ్లా, వేప,
బ్రహ్మి హేరాయిల్సు



MEDICATED
&
DELIGHTFULLY
PERFUMED
HAIR TONICS

అనాదిగా భారతీయులచే పై మూడు (అమ్లా, వేప, బ్రహ్మి) వృక్షములు పూజింపబడుచున్నవి. యేలననగా వీటియందుగల అమూల్యమైన ఓషధీగుణమే కారణము. ఈ అమూల్య గుణములను కోరువారు ఈ ఓషధులతో తయారు చేయబడిన పై హేరాయిల్సును, ఉపయోగించిన పై గుణమేకాక యింపగు పరిమళమును పొందగలరు. శిరోజ పోషణకు - మెదడు - కన్నులకు - చల్లనిదనము నిచ్చుటలో సాటిలేనివి.

VIJAYA CHEMICAL & TOILET WORKS
"VIJAYA MANSIONS"
15, CLEMENS ROAD, PURASAWALKAM, MADRAS. 7.

విజయా కెమికల్స్,
15, క్లెమన్సు రోడ్డు, పురసవాక్కం,
మదరాసు-7.

Source: Press Academy Website, Kinnera Magazine, June 1952

Disclaimer: This SELECTIVE topic/article/write-up of Illindala Saraswati Devi gaaru is nostalgic. It has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience.

No intention what so ever of copy right violation is involved.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with due apologies.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/